# సాక్షి
# జయశంకర్ భూపాలపల్లి

బుధవారం । 6 । నవంబర్ । 2024




**ఎన్పీడీసీఎల్‌లో క్రీడలకు పెద్దపీట**

క్రీడలకు టీజీఎన్పీడీసీఎల్ ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తుందని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. - 8లో▸



**ఎన్ఎస్ఎస్‌కు నిధులు కరువు**

కేయూ పరిధిలోని ఎన్ఎస్ఎస్ యూనిట్లకు నిధులు విడుదల కాకపోవడంతో వలంటీర్ల సేవలు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. - 8లో▸

**గరిష్టం/కనిష్టం**
**$32.6^0$ / $19.2^0$**

**వాతావరణం**

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం మామూలు ఎండగా ఉండి, రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### సెల్‌ఫోన్ల రికవరీలో ఉత్తమ ప్రతిభ



**భూపాలపల్లి:** సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ల రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా పోలీసు అధికారులను డీజీపీ జితేందర్ ప్రశంసించారు. 2023 ఏప్రిల్ నుంచి అక్టోబర్ 2024 వరకు జిల్లావ్యాప్తంగా 484 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి, స్వాధీనం చేసుకొని యజమానులకు అప్పగించారు. ఇందుకు గాను డీజీపీ జితేందర్ మంగళవారం ఎస్పీ కిరణ్ ఖరే, జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అభినందించారు. జిల్లా సీఈఐఆర్ పోర్టల్ ఆఫీసర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లును హైదరాబాద్‌లో అభినందించి ప్రశంసా పత్రం అందించారు.

### కాలసర్ప పూజలకు భక్తుల రద్దీ



**కాళేశ్వరం:** కాళేశ్వరం దేవస్థానం అనుబంధ దేవాలయంలో మంగళవారం శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు కాలసర్ప నివారణ పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో అభిషేక పూజలు, శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు చేశారు. దీంతో ఆలయానికి వివిధ పూజలు, లడ్డూ, ప్రసాదాల ద్వారా రూ.1.80లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపారు. కార్తీకదీపాన్ని మంగళవారం సాయంత్రం వెలిగించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, అర్చకులు ఫణీంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

### పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



**భూపాలపల్లి అర్బన్:** ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్లకల్ల తిరుపతి డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. టీపీయూఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ధర్మాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు నాలుగు డీఏలు, పెండింగ్ బకాయిలు చెల్లించాలని, పీఆర్సీ అమలు చేయాలని, 317 జీఓ బాధిత ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీపీఎస్‌ను అంతంచేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు మారబోయిన మహేందర్, నాయకులు శాంత, శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్, అరవింద, రఘుపతి, గిరిధర్ పాల్గొన్నారు.

### వర్తక సంఘాల ఆధ్వర్యంలో విరాళాలు



**భూపాలపల్లి అర్బన్:** జిల్లాకేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు పట్టణంలోని వివిధ వర్తక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం విరాళాలు అందజేశారు. కిరాణ, జువెల్లరీ, ఫర్టిలైజర్స్ యూనియన్‌ల ఆధ్వర్యంలో రూ.3.55లక్షలు మంగళవారం సీఐ నరేష్‌కుమార్‌కు అందజేశారు. డీఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వర్తక వాణిజ్య సంఘాలు ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించడం సంతోషకరని సీఐ అన్నారు.

### పోరాటాలతోనే డైట్ చార్జీల పెంపు

**ములుగు రూరల్:** ఎస్ఎఫ్ఐ పోరాటాలతో ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిందని సంఘం జిల్లా కార్యదర్శి తోకల రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రభుత్వం విద్యార్థులకు రూ. 1500 చెల్లించేదని ప్రస్తుతం వాటిని రూ.2100కు పెంచిందని వివరించారు. ప్రభుత్వం విద్యార్థుల డైట్ చార్జీలు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు.



కాళేశ్వరం: పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళా భక్తులు



కాళేశ్వరం: పుట్టకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



రేగొండ: కొడవటంచ ఆలయంలో..

## నాగుల చవితి

నాగుల చవితి సందర్భంగా శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయం శ్రీనాగేంద్రస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని పుట్టలో పాలు పోసి నైవేద్యం సమర్పించారు. మహిళలు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ మారుతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ, బైకుంఠపాండా, ఫణీంద్రశర్మ, కాంగ్రెస్ నాయకుడు కామిడి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కాళేశ్వరం

# 20ఏళ్లుగా ఎదురుచూపు

**కలగా మినీ ఐటీడీఏ ఏర్పాటు**

- కాటారం డివిజన్‌లో ఏర్పాటుకు గతంలో హామీ
- మాడా కార్యాలయం సైతం ఏటూరునాగారం తరలింపు
- మారని గిరిజనుల జీవన స్థితిగతులు
- అందని ప్రభుత్వ ప్రోత్సాహం



మహదేవపూర్ మండలకేంద్రంలోని మాడా క్యాంపు కార్యాలయం

**కాటారం:** కాటారం సబ్ డివిజన్‌లో మినీ ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని పాలకులు ఇచ్చిన హామీ 20 సంవత్సరాలుగా అమలుకు నోచుకోవడం లేదు. కాటారంలోని (మాడిఫైడ్ ఏరియా డెవలప్‌మెంట్ అప్రోచ్ (మాడా) కార్యాలయాన్ని సైతం ఏటూరునాగారం తరలించడంతో గిరిజనులు అటవీ ఉత్పత్తులు విక్రయించే అవకాశం లేకుండా పోయింది. ఆదరణ లేకపోవడంతో అటవీ ఉత్పత్తుల సేకరణకు గిరిజనులు దూరమవుతున్నారు.

**అటవీ గ్రామాలే అధికం..**

కాటారం సబ్ డివిజన్ పరిధిలో కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, మల్హర్, పలిమెల మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో అధికంగా అటవీ గ్రామాలే ఉండటంతో గిరిజనులు, ఆదివాసీ జనాభా ఎక్కువగా నివసిస్తున్నారు. వీరంతా అడవులకు హాని తలపెట్టకుండా అడవిలో విరివిరిగా లభించే చీపురు, ఇప్పపువ్వు, అటవిబంక ఇతరత్రా అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. వీరు సేకరించిన అటవి ఉత్పత్తులను ఐటీడీఏలో విక్రయించాల్సి ఉంటుంది. దానికి అనుగుణంగా 20 ఏళ్ల క్రితం కాటారం సబ్ డివిజన్‌లో మినీ ఐటీడీఏ ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇప్పటివరకు ఊసే లేకుండా పోయింది. ఏటూరునాగారం ఐటీడీఏకు వెళ్లాల్సిన భారం తప్పుతుందని భావించిన ఈ ప్రాంత గిరిజనుల ఆశ ఇప్పటికీ నెరవేరడం లేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వాలు మారుతూ వచ్చినప్పటికీ ఐటీడీఏ ఏర్పాటుకు మాత్రం ముందడుగు పడటం లేదని గిరిజనులు వాపోతున్నారు.

**ఫలించని ప్రయత్నాలు..**

భూపాలపల్లి జిల్లా కేంద్రంలో లేదా కాటారంలో ఏటీడబ్ల్యూఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని కొంత కాలంగా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, గిరిజన, ఆదివాసీ సంఘాల నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి కాటారంలో ఐటీడీఏ, ఏటీడబ్ల్యూఓ కార్యాలయాల ఏర్పాటు కోసం విన్నవించారు. అయినప్పటికీ మాడా ఏర్పాటు ప్రక్రియ మాత్రం ముందుకు సాగలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మినీ ఐటీడీఏ ఏర్పాటు చేస్తుందనే ఆశాభావంతో గిరిజన, ఆదివాసీ ప్రజలు ఉన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండటంతో తమ చిరకాల కోరిక నెరవేరుతుందని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. పలువురు ఆదివాసీ, గిరిజన సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు సైతం మినీ ఐటీడీఏ ఏర్పాటు విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. దీంతో ఈ ప్రాంతంలో మినీ ఐటీడీఏ ఏర్పాటు జరుగుతుందని బలమైన నమ్మకంతో ఉన్నారు.

**20వేల మంది గిరిజన జనాభా..**

కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల పరిధిలో సుమారు 20వేల గిరిజన, ఆదివాసీలు నివసిస్తున్నారు. కాటారంలో 1,050, మల్హర్‌లో 3,500, మహదేవపూర్‌లో 6,900, మహాముత్తారంలో 8,400 మంది నివసిస్తున్నట్లు అంచనా. గతంలో అటవీ ఉత్పత్తులను సేకరించి మహదేవపూర్ మాడా కార్యాలయంలో విక్రయించి జీవనోపాధి పొందేవారు.కొంత కాలం క్రితం మాడా కార్యాలయాన్ని ఏటూరునాగారం తరలించడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఐటీడీఏ ఏర్పాటు చేయాలి**



కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో అధికంగా అటవీ గ్రామాలే ఉన్నాయి. ఎక్కువ శాతం గిరిజన, ఆదివాసీ కుటుంబాలు నివసిస్తున్నాయి. గిరిజన అభివృద్ధి శాఖ ద్వారా వీరికి పూర్తి స్థాయిలో సంక్షేమ ఫలాలు అందడం లేదు. ఈ ప్రాంతంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

- మడె కుమార్,
ఆదివాసీ తుడుందెబ్బ నాయకుడు

# ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న వినయ్‌కృష్ణారెడ్డి

**ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేకాధికారి వినయ్‌కృష్ణారెడ్డి**

**మొగుళ్లపల్లి:** రైతులు ఇబ్బందులకు గురికాకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేకాధికారి వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. మొగుళ్లపల్లి మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా జిల్లాలో కొనుగోళ్లు చేపట్టాలని, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించి ఏమైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సన్న, దొడ్డు రకం ధాన్యం బస్తాలు విడివిడిగా భద్రపరచాలని, రకాలు గుర్తించడానికి వీలుగా చెరిగిపోకుండా గుర్తులు వేయాలని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం ట్యాగింగ్ చేసిన మిల్లులకు రవాణా చేసేందుకు, రవాణాకు ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మిల్లర్లు ధాన్యం దిగుమతికి జాప్యం జరుగకుండా హమాలీలను సిద్ధంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల సంస్థ డీఎం రాములు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింగరావు ఉన్నారు.

# పంట పొలాల పరిశీలన

**భూపాలపల్లి:** రేగొండ, భూపాలపల్లి మండలాల్లోని వరి, పత్తి, మిర్చి తోటలను మంగళవారం వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.దిలీప్‌కుమార్, డాక్టర్ నాగభూషణం, డాక్టర్ విశ్వతేజ, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌భాస్కర్ పరిశీలించారు. పత్తిలో రసం పీల్చు పురుగులు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. నివారణకు డాఫెంతయురాన్ అనే మందును 1.25 గ్రాములు లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీరు చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. మిర్చి తోటలో తామర పురుగు వ్యాప్తిని గమనించి నివారణకు ఫిప్రోనీల్ 2 ఎంఎల్, లేదా స్పినోసాడ్ 0.3 ఎంఎల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో మండల వ్యవసాయ అధికారులు వాసుదేవరెడ్డి, ఐలయ్య, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



రేగొండలో పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

# రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రాజేందర్



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ

**జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్**

**భూపాలపల్లి అర్బన్:** రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ కోరారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఖోఖో, వాలీబాల్ క్రీడాపోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి సారించాలని కోరారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులు అన్ని రంగాల్లో రాణించగలుగుతున్నారని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని.. ఓటమి పాలైన వారు వెనుకడుగు వేయకుండా ముందుకు సాగితే గెలుపునకు నాంది అవుతుందన్నారు. జిల్లాలో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని జోనల్, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరుకు తీసుకువచ్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శిరంగి రమేష్, డీఈఓ కార్యాలయ కోఆర్డినేటర్ రాజబాబు, డీవైఎస్ఓ జయపాల్, పీడీ, పీఈటీలు సాంబమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఇళ్ల జాబితా సిద్ధం చేయాలి

- 8న సర్వే ప్రారంభం కావాలి
- కలెక్టర్ రాహుల్ శర్మ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి:** సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు బుధ, గురువారాల్లో ఇళ్ల జాబితా (హౌస్ లిస్టింగ్) తయారు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. బుధవారం నుంచి హౌస్ లిస్టింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, సూపర్‌వైజర్లతో ఐడీఓసీ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 6, 7 తేదీల్లో గ్రామ, మున్సిపాలిటీలో ఇంటింటి జాబితా ప్రారంభం చేయాలని తెలిపారు. రెండు రోజుల్లో ఇంటింటి జాబితా గణనలో ప్రతీ ఇంటికి స్టిక్కర్ అంటించాలని, సర్వే పూర్తయిన తదుపరి మార్కర్ పెన్‌తో తేదీ వేయాలని సూచించారు. 8వ తేదీ నుంచి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం కావాలన్నారు. ఈ ప్రక్రియ 15 రోజుల్లో పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 12 మండలాలు, భూపాలపల్లి మున్సిపల్ పరిధి కలిపి 1,31,030 ఇళ్ల సర్వే నిర్వహణకు 993 ఎన్యుమరేషన్ బ్లాకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్వే నిర్వహణకు గ్రామీణ ప్రాంతాల్లో 842మంది, పట్టణ ప్రాంతంలో 92మందితో కలిపి 934మంది ఎన్యుమరేటర్లను నియమించినట్లు చెప్పారు. రిజర్వ్‌లో 109మందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పర్యవేక్షణకు గ్రామీణ ప్రాంతాలకు 92మంది, పట్టణ ప్రాంతానికి 9మంది, రిజర్వ్‌డ్‌లో 22మంది మొత్తం 123మందిని నియమించామన్నారు. ఎన్యుమరేటర్లకు అవసరమైన స్టేషనరీతో కూడిన కిట్ అందచేసినట్లు తెలిపారు. సర్వేకు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను నియమించామని ఆ ఉపాధ్యాయులు ఒకపూట పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజనం అనంతరం సర్వేలో పాల్గొనాలని సూచించారు. కాటారం డివిజన్‌కు సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, భూపాలపల్లికి ఆర్డీఓ మంగీలాల్ నోడల్ అధికారులుగాను, జిల్లా నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మిని నియమించినట్లు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సీపీఓ బాబూరావు, డీపీఓ నారాయణరావు, ఆర్డీఓ మంగీలాల్ పాల్గొన్నారు.

# సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

**జెన్‌కో సీఈకి భూ నిర్వాసితుల వినతి**




వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

**మల్హర్:** మండలంలోని పెద్దతాడిచర్ల డేంజర్ జోన్ ఇండ్లు సేకరించి, తమను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని భూ నిర్వాసితులు జెన్‌కో సీఈ ప్రకాశ్‌ను కోరారు. తాడిచర్ల, కాపురం గ్రామాల జెన్కో భూనిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వాసితులు చెల్పూర్ కేటీపీపీలో జెన్‌కో సీఈ ప్రకాశ్‌ను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాడిచర్ల, కాపురం గ్రామాల్లోని నిరుద్యోగులకు జెన్‌కోలో ఉద్యోగాలు ఇస్తామని అధికారులు గతంలో ఇచ్చిన హామీని ఇప్పటికైనా నిలుపుకోవాలన్నారు. భూములను కోల్పోయి తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఓపెన్‌కాస్ట్ ప్రారంభమై ఏడు సంవత్సరాలు గడుస్తున్నా తమను సురక్షిత ప్రాంతాలకు తరలించలేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో తాడిచర్ల, కాపురం గ్రామాల జెన్కో భూనిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి, కమిటీ కార్యదర్శి తాండ్ర సంతోష్ కుమార్, కమిటీ ముఖ్య సలహాదారు ఇందారపు ఎల్లయ్య పాల్గొన్నారు.

## ఏటీసీ పనుల అడ్డగింత

**కాటారం:** కాటారం మండలకేంద్రంలోని తిమ్మన కుంట శిఖం భూమిలో కొనసాగుతున్న ఐటీఐ అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్(ఏటీసీ) భవనం నిర్మాణం పనులను మంగళవారం చుట్టుపక్కల రైతులు అడ్డుకున్నారు. శిఖం భూమిని ఆనుకొని తమ ఇళ్ల స్థలాలు, సాగు భూములు ఉన్నాయని సర్వే చేసి తమ భూములకు హద్దులు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. తమ భూములకు హద్దులు ఏర్పాటు చేసేంత వరకు నిర్మాణాలు చేపట్టవద్దని అధికారులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై మ్యాక అభినవ్ ఘటనా స్థలానికి చేరుకొని పనులు అడ్డుకున్న వారితో చర్చించారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి సర్వే చేయించుకోవాలే తప్ప పనులు అడ్డుకోవడం సరికాదని హెచ్చరించారు. వారు ఒప్పుకోకపోవడంతో పోలీసుల పహారా నడుమ పనులు కొనసాగించారు.

## జిట్రేగి కలప పట్టివేత



**భూపాలపల్లి :** అక్రమంగా తరలిస్తున్న జిట్రేగి కలపను పట్టుకున్నట్లు భూపాలపల్లి రేంజ్ ఆఫీసర్ నరేష్ తెలిపారు. రేంజ్ ఆఫీసర్ తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరి నది పరివాహక ప్రాంతం మీదుగా హనుమకొండ వైపు అక్రమంగా కలప తరలిస్తున్నట్లు సోమవారం తెల్లవారుజామున సమాచారం అందింది. ఈ మేరకు గాలింపు చర్యలు చేపడుతుండగా భూపాలపల్లి పట్టణం ప్రధాన రహదారి మీదుగా ఒక ట్రాలీ(జీనాన్ పికప్) వెళ్తుంది. అనుమానం వచ్చి ఆపేందుకు ప్రయత్నించగా వాహన డ్రైవర్ ఆపకుండా వేగాన్ని మరింత పెంచాడు. దీంతో వెంబడించి రేగొండ మండలంలోని బాగిర్థిపేట క్రాస్ వద్ద ట్రాలీని పట్టుకోవడం జరిగిందన్నారు. కాగా డ్రైవర్, అందులో ఉన్న వ్యక్తి వెంటనే పరారైనట్లు తెలిపారు. వాహనంలో తనిఖీ చేయగా జిట్రేగి దిమ్మెలు ఉండటంతో వాహనం, కలపను రేంజ్ కార్యాలయానికి తరలించి పీఓఆర్ నమోదు చేశామన్నారు. పట్టుకున్న కలప విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందని రేంజ్‌ఆఫీసర్ తెలిపారు. ఈ పట్టివేతలో బీట్‌ఆఫీసర్ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

# ఓపెన్‌కాస్ట్‌ను పరిశీలించిన జీఎం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

**భూపాలపల్లి అర్బన్:** జీఎంగా బాధ్యతలు స్వీకరించిన రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం ఏరియాలోని గనులను పరిశీలించి ఉత్పత్తి ఉత్పాదకత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్–3ని పరిశీలించి గని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గని స్థితి గతులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. గని అభివృద్ధికి కావాల్సిన ఏర్పాట్లు పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కవీంద్ర, అధికారులు భానుప్రసాద్, శ్రీనివాస్, అరుణ్‌ప్రసాద్, దయాకర్, కార్తీక్ పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేను కలిసిన జీఎం..**

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జీఎం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శాలువాతో సత్కరించి ఏరియాలో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ, ఆర్అండ్ఆర్, ఇతర అంశాలపై చర్చించారు.

**గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్**

ఏరియాలోని కేటీకే 1వ గనిలో గైర్హాజరు కార్మికులకు మంగళవారం గని మేనేజర్ ఎం.తిరుపతి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 74 మస్టర్లకు తక్కువ చేసిన ఉద్యోగులను కౌన్సెలింగ్‌కు పిలువగా 89 మందికి గాను 30 మంది కార్మికులు మాత్రమే హాజరయ్యారు. విధులకు హాజరయ్యే విధంగా కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలని గని మేనేజర్ తిరుపతి కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ రూప్‌సింగ్, నాయకులు పాల్గొన్నారు.

## ఇసుక తోడితే కేసులు

**ఏటూరునాగారం:** ఎకో సెన్సిటీవ్ జోన్‌లో ఇసుక తవ్వకాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని అటవీశాఖ రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ అన్నారు. మండల పరిధిలోని మల్యాల గ్రామంలో జంపన్నవాగు సమీపంలోని నిల్వ ఉన్న ఇసుకను ఎత్తడం కోసం జేసీబీ, లారీలను మంగళవారం సిద్ధం చేశారు. దీంతో వాటిని అడ్డుకొని పనులు నిలిపివేశామన్నారు. అనంతరం అందుబాటులో ఉన్న ఆరు టిప్పర్లను రేంజ్ కార్యాలయానికి తీసుకొచ్చి డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి నోటీసులు ఇచ్చామన్నారు. ములుగులోని మెడికల్ కళాశాల నిర్మాణానికి సంబంధిత కేపీఎం కాంట్రాక్టర్ మల్యాలలోని ఇసుకను తోడేందుకు అనుమతి పొందాడని తెలిపారు.

## గ్రామీణ ప్రాంతంలో సైక్లింగ్ క్రీడకు ప్రోత్సాహం

రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయకాంతారావు



పోటీలను ప్రారంభిస్తున్న ఏసీపీ పార్థసారథి

**లింగాలఘణపురం:** గ్రామీణ ప్రాంతాల్లో సైక్లింగ్ క్రీడను ప్రోత్సహించడానికే మొదటి సారిగా జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలో 9వ అంతర్ జిల్లా రోడ్ సైక్లింగ్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించినట్లు రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయకాంతారావు తెలిపారు. మంగళ వారం 9వ అంతర్ జిల్లా సైక్లింగ్ చాంపియన్ షిప్ పోటీలను జనగామ ఏసీపీ పార్థసారథితో కలిసి ప్రారంభించారు. లింగాలఘణపురం దుర్గమ్మ గుడి నుంచి నెల్లుట్ల వరకు 5కి.మీ మేర ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సైక్లింగ్ క్రీడ అంతగా తెలియదని, ఇలాంటి క్రీడపై యువతలో ఆసక్తి కలిగించేందుకు జనగామ జిల్లాలో అంతర్ జిల్లా పోటీలను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి క్రీడలతో శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. యువత క్రీడల ద్వారా ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని 22 జిల్లాల నుంచి 382 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, మొదటి రోజు అండర్ 14, బాలబాలికలకు 5 కి.మీ పోటీలతోపాటు 18 ఏళ్ల యువకులకు పోటీలు నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు కిషన్ తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కైలాస్‌యాదవ్, జనగామ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుమార్‌గౌడ్, ఎస్సై శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవను విస్తృతం చేయాలి



సమావేశమైన వరంగల్ జిల్లా విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం

**గోవిందరావుపేట:** సమాజ సేవను మరింత విస్తృతపరిచేందుకు ఓపిక ఉన్నంత వరకు కృషి చేద్దామని వ్యాయమ విద్య ఉపాధ్యాయ సంఘం నేతలు అన్నారు. మండలంలోని లక్నవరం సమీపంలోని విరంచి రిసార్ట్‌లో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్రాంతి వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీని జిల్లా గౌరవ అధ్యక్షుడు బలరాం రెడ్డి అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రోజునాల అనూప్ కుమార్, కార్యదర్శిగా కన్నెబోయిన సారయ్య, కోశాధికారిగా ఎస్.రాజయ్యల తోపాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, తోట సాంబయ్య, రమేశ్‌రెడ్డి, దశరథం, విజయ్ కుమార్ రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీరామ్ రెడ్డి, చేరాలు, మల్లికార్జున్, సుధీర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



# ఎన్ఎస్ఎస్‌కు నిధులు కరువు

**కేయూ పరిధిలో 356 ఎన్ఎస్ఎస్ యూనిట్లు**

- రావాల్సిన నిధులు రూ 2.67 కోట్లు
- ఇటీవల రూ.20లక్షలే విడుదల
- కానరాని ప్రత్యేక శిబిరాలు.. యువజనోత్సవాలు
- మైభారత్ పోర్టల్‌లోనూ సమస్యే..



మార్కెట్ పరిసరాలను శుభ్రంచేస్తున్న హనుమకొండలో కేడీసీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు (ఫైల్)

**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాల్లో విస్తరించి ఉన్న జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్ల సామాజిక సేవా కార్యక్రమాలతో రాష్ట్రపతి అవార్డు అందుకున్న ఘనత ఉంది. కానీ, రెండేళ్లుగా పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడంతో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు అంతంత మాత్రంగానే అందించే పరిస్థితి నెలకొంది.

### రూ.20లక్షలే విడుదల

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో 11 జిల్లాల్లో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ అండ్ పీజీ కళాశాలలు కలిపి 356 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌కు 100 మంది చొప్పున మొత్తంగా 35,600 ఎన్ఎస్ఎస్ వలంటీర్లున్నారు. గతంలో క్లీన్ అండ్ గ్రీన్, శ్రమదానం, మొక్కలు నాటడం, సామాజిక రుగ్మతలపై చైతన్యం రక్తదాన శిబిరాలు నిర్వహించేవారు. కేంద్ర క్రీడల, యువజన మంత్రిత్వశాఖ ఆదేశాలమేరకు హైదరాబాద్‌లోని ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టరేట్ ఆదేశాల మేరకు కేంద్రప్రభుత్వం నిధులతో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు కొనసాగేవి. ఎన్ఎస్ఎస్ సేవల్లో ప్రధానంగా స్వచ్ఛభారత్, స్వచ్ఛతా హీ సేవా, మేరాదేశ్ మేరామట్టి, స్వాభిమాన్ స్వచ్ఛత, స్వభావ్ స్వచ్ఛత, రాష్ట్రీయ ఏక్తా దివస్, రాష్ట్రీయ సమ్విధాన్ దివస్, ఏక్‌భారత్ శ్రేష్ఠ భారత్ దివాళి విత్ మైభారత్ తదితర చైతన్య కార్యక్రమాలతోపాటుగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నారు. డిజిటల్ ఇండియా ,డిజిటల్ లిటరసీ పై కూడా కార్యక్రమాలు చేపట్టాలనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలున్నాయి. వీటి నిర్వహణ సందర్భంగా ఆయా ఆ వలంటీర్లకు స్నాక్స్, బ్యానర్లు, సమావేశాల నిర్వహణకు నిధులు అవసరం ఉంటుంది. ఒక యూనిట్‌కు రూ.27,500, అదేవిధంగా ఏదైనా గ్రామంలో యూనిట్ వారం రోజులపాటు ప్రత్యేక శిబిరం 50 మంది వలంటీర్లతో ఏర్పాటుచేస్తే రూ.35వేలు ఇస్తారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై నవంబర్ నెల వచ్చినా ఎన్ఎస్ఎస్ యూనిట్లకు నిధులు ఇవ్వకపోవటంతో కార్యక్రమాలు సాగడంలేదు. కొందరు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సొంతఖర్చులతో సేవా కార్యక్రమాలు నిర్వహించి నిధుల విడుదల కోసం వేచిఉన్నారు. కేంద్ర ప్రభుత్వం కాకతీయ యూనివర్సిటీకి ఈవిద్యాసంవత్సరానికిగాను రూ.2.67 కోట్లు విడుదల చేయాల్సిండగా అక్టోబర్‌లో కేవలం రూ.20 లక్షలే విడుదల చేసింది. అయితే తక్కువ నిధులు కావడంతో కేయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ వాటిని ఏ యూనిట్‌కు విడుదల చేయలేదు. కాగా.. ఈనిధుల విడుదల, వినియోగానికి వీసీ అప్రూవల్ కూడా తీసుకోవాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా. ఈ విద్యాసంవత్సరం ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలకు సంబంధించి కేయూ ఎన్ఎస్ఎస్ అడ్వయిజరీ కమిటీ మీటింగ్, ఉమ్మడి జిల్లాస్థాయిలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశం నిర్వహించకపోవడం గమనార్హం.

### మైభారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్

కేంద్ర ప్రభుత్వం ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి మైభారత్ పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఇందులో కళాశాలల పేర్లు, వలంటీర్ల వివరాలు రిజిస్ట్రేషన్ చేయాలి. ఈ పోర్టల్‌లో ప్రతి కాలేజీ లాగిన్ అయి నూతన వలంటీర్లు, కోఆర్డినేటర్ల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలనుకుంటే ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. ప్రత్యేక శిబిరం ఎక్కడ నిర్వహించేది.. ఏఏ కార్యక్రమాలు చేసేది కూడా అప్‌లోడ్ చేసి యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌కు ప్రతిపాదించి అనుమతి పొందాకే శిబిరాలు నిర్వహించాలి. అయితే మైభారత్ పోర్టల్‌లో కొన్ని జూనియర్ కళాశాలల పేర్లు చూపటంలేదు. దీంతో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు తమ వలంటీర్ల వివరాలు నమోదు చేయలేకపోతున్నారు. పలు కళాశాలల ప్రోగ్రాం ఆఫీసర్లు ఈ సమస్యపై సంబంధిత అధికారులకు వివరించినా.. సమస్య పరిష్కారం కాలేదు.

### ఊసేలేని ప్రత్యేక శిబిరాలు..

గ్రామీణ ప్రాంతాల్లో కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఒక్కో యూనిట్ ఒక ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించుకునే వీలుంటుంది. కానీ ఈ విద్యాసంవత్సరంలో యూనివర్సిటీ పరిధిలో ఒక్క ప్రత్యేక శిబిరం కూడా నిర్వహించలేదు. వలంటీర్లు గ్రామాల్లోకి వెళ్లి సామాజిక రుగ్మతలపై చైతన్యం కలిగించడం, దసరా, దీపావళి సందర్భాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రోగ్రాం ఆఫీసర్లు సొంతంగా ఖర్చు చేసి ప్రత్యేకశిబిరాలు నిర్వహించుకొని నిధులు మంజూరైన తర్వాత బిల్లులు పెట్టుకునేవారు. కానీ, గత సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం ఇందులో పలు మార్పులు తీసుకొచ్చింది. దీంతో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అంతగా ఆసక్తికనపర్చడంలేదు.

**త్వరలో అడ్వయిజరీ కమిటీ సమావేశం**



కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల అడ్వయిజరీ కమిటీ సమావేశం వారం రోజుల్లో నిర్వహిస్తాం. ఈ విద్యాసంవత్సరానికి ఆలస్యంగా కేవలం అక్టోబర్ రూ.20 లక్షలే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఎన్ఎస్ఎస్‌కు సంబంధించిన సమస్యలను వీసీ దృష్టికి తీసుకెళ్తాను. ఉమ్మడిజిల్లాల వారీగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశం కూడా నిర్వహిస్తాం. మైభారత్ పోర్టల్‌లో వలంటీర్లు, ప్రోగ్రాం ఆఫీసర్ల వివరాలు నమోదైతేనే నిధులు విడుదల అవుతాయి.

– ప్రొఫెసర్ ఈసం నారాయణ, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్

### కానరాని యువజనోత్సవాలు..

విద్యార్థులు చదువుతోపాటు ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా సామాజిక సేవలు అందించటంతోపాటు తమలోని సృజనాత్మకత, సాంస్కృతిక ప్రతిభను వెలికి తీసుకొనేందుకు అవకాశం కల్పించాలి. ఇందుకు ఉమ్మడి జిల్లాస్థాయి, యూనివర్సిటీ స్థాయిలోనూ యువజనోత్సవాలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ, గత రెండేళ్లుగా నిధుల లేమితో యువజనోత్సవాలు నిర్వహించడంలేదు.

### రెమ్యునరేషన్ చెల్లించడంలేదు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో 356 మంది ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఉన్నారు. ఒక్కో ప్రోగ్రాం ఆఫీసర్‌కు రూ.8,500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. వీరికి మూడేళ్లుగా రెమ్యునరేషన్ ఇవ్వకపోవంతో కార్యక్రమాల నిర్వహణపై అనాసక్తితో ఉన్నారు. ఎన్ఎస్ఎస్‌పై ఆసక్తి ఉన్న ఆఫీసర్లు పలువురు సొంతఖర్చులతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిధులు విడుదల చేయకుండా ఉంటే రాబోయే కాలంలో ఎన్ఎస్ఎస్ యూనిట్లు తగ్గిపోయే అవకాశాలు లేకపోలేదు.

## ఎన్పీడీసీఎల్‌లో క్రీడలకు పెద్దపీట

- సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



ట్రోఫీని అందజేస్తున్న వరుణ్‌రెడ్డి

**హన్మకొండ :** టీజీఎన్పీడీసీఎల్ క్రీడలకు ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తుందని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రంలోని ట్రాన్స్, డిస్కమ్స్‌లోని అన్ని సర్కిల్ పరిధిలో నిర్వహించిన టోర్నమెంట్‌లో అత్యధిక పాయింట్లు సాధించిన వరంగల్ సర్కిల్‌కు సీఎండీ వరుణ్‌రెడ్డి చైర్మన్ ట్రోఫీని అందజేశారు. 2023–24 సంవత్సరానికి జరిగిన పోటీల్లో ఉమ్మడి వరంగల్ సర్కిల్ అగ్రస్థానంలో నిలిచింది. ఉమ్మడి వరంగల్ స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ వెంకటరమణ సీఎండీ చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కౌన్సిల్ కన్వీనర్ విజేందర్‌రెడ్డి, కోశాధికారి సంతోశ్, ఇన్‌చార్జ్ డైరెక్టర్ మధుసూదన్, ఎస్ఈలు మధుసూదన్, నరేశ్‌కుమార్, వేణుమాధవ్, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు యాకూబ్‌పాషా, సునీల్‌కుమార్, ప్రేమ్‌కుమార్, ఎస్ఏఓ నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రేపు జాబ్‌మేళా

**హన్మకొండ అర్బన్:** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 7న (గురువారం) జాబ్ మేళా నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన అధికారి మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదారాబాద్‌లోని మాళవికా డెవెలపర్స్ కంపెనీలో 50 మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఈ ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వారై ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు గురువారం ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే మేళాకు హాజరుకావాలని తెలిపారు. రెస్యూమ్, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో రావాలని, సందేహాల నివృత్తికి 78933 94393 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

## ముగిసిన 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు



కత్తిసాము క్రీడల్లో పోటీ పడుతున్న బాలికలు



క్రీడాకారులతో అధికారులు, నిర్వాహకులు

- 120 మంది క్రీడాకారులకు పతకాలు

**నెల్లికుదురు:** రెండు రోజులుగా మండల కేంద్రం లోని ప్రభుత్వం జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో హోరాహోరీగా జరిగిన అండర్ –14, 17, 19 విభాగం 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు మంగళవారం ముగిసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఈ క్రీడలు 100 మంది టెక్నీషియన్స్, అధికారుల పర్యవేక్షణలో రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన 600 మంది క్రీడాకారులు మూడు విభాగాలుగా ఆర్చరీ, కత్తిసాము పోటీలో పాల్గొన్నట్లు తెలిపారు. ఆర్చరీ, కత్తిసాము క్రీడల్లో మూడు విభాగాల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిన 120 మంది జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. 120 మందికి క్రీడాకారులకు బంగారు, సిల్వర్ పతకాలు ఎస్సై చిర్ర రమేశ్‌బాబు, ఎంఈఓ రాందాస్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు చెడుపల్లి అయిలయ్య, అధికారులు, పరిశీలకులు పాల్గొన్నారు.

## సర్వేలో ఆరె కులం అని రాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగుర్ల వెంకటేశ్వర్లు

- ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు

**హన్మకొండ :** బీసీ జనగణన, సమగ్ర కుటుంబ సర్వేలో ఆరె కులస్తులంతా సర్వేలో ఆరె కులమని స్పష్టంగా రాయించాలని ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు సూచించారు. హనుమకొండ ఇందిరానగర్‌లో మంగళవారం నిర్వహించిన ఆరె కుల సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడారు. 6వ తేదీ నుంచి బీసీ కులగణన చేపడుతున్నారని అన్నారు. ఆరె కులస్తులందరూ జనగణన, కులగణనలో పాల్గొన్నాలని తెలిపారు. ఆరె కులం బీసీ(డీ)–34 అని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఈ గణన ఓబీసీకి సంబంధించింది కాదని, స్థానిక సంస్థల ఎన్నికల కోసమే చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు ప్రామాణికంగా తీసుకోనున్నారని తెలిపారు. ఆరె కులస్తులు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండి కులం పేరును ఖచ్చితంగా రాయించాలని చెప్పారు. సమావేశంలో ఆరె సంక్షేమ సంఘం నాయకులు నాగుర్ల శంకర్‌రావు, వలిగె సాంబారావు, లాండిగ లక్ష్మణ్‌రావు, జగన్మోహన్‌రావు, గుండెకారి రంగారావు, సుధాకర్, ఇంగె శివాజీ, వంచనగిరి వీరేశం, కిషన్‌రావు, మనోహర్‌రావు, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- స్వగ్రామంలో విషాదం
- పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



కర్ణాకర్‌రెడ్డి (ఫైల్)



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**రాయపర్తి:** మొదటి నుంచి చదువులో ప్రతిభ కనబరిచి బిట్స్‌పిలానీలో సీటు సాధించిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కర్ర సరితరవీందర్‌రెడ్డి మూడో కుమారుడు కర్ర కర్ణాకర్‌రెడ్డి(22) హైదరాబాద్‌లోని బిట్స్‌పిలానీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలలో ప్రతి రోజు సాయంత్రం వేళలో 7 నుంచి 8గంటలకు ఫ్రీగా వదిలే సమయంలో సోమవారం ఫ్రెండ్‌తో కలిసి బైక్‌పై బయటకు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన కర్ణాకర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

**హన్మకొండ :** యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా కందిలో అధిక దిగుబడి సాధించవచ్చని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఉమారెడ్డి అన్నారు. వరంగల్ పైడిపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో కంది పూత సమయంలో తెగుళ్ల ప్రబలకుండా ఉండేందుకు డ్రోన్ల ద్వారా మందు పిచికారీ చేసే విధానంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమారెడ్డి మాట్లాడుతూ.. పూతదశలో కాయ తొల్చు పురుగులైన శెనగపచ్చ పురుగు, మారుక పూతగూడు పురుగుల నివారణకు హిమామెక్టిన్, బెంజోయెట్ 0.4 గ్రాములు, వేప నూనె 1,500 డీపీఎం, 5 మి.లీ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రథమ శ్రేణి పరీక్షలకు విత్తనం తీసుకొని పంట పండిస్తున్న రైతులకు కిటకనాశినులైన వేపనూనె, కోరాంటనిల్‌ప్రోల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అపరాల విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.సంధ్యా కిషోర్, ఎఫ్ఎల్‌డీ ఎం.మధు, శాస్త్రవేత్తలు ఎస్.ఓంప్రకాశ్, జి.పద్మజ, వీరన్న రైతులు పాల్గొన్నారు.



డ్రోన్ ద్వారా క్రిమిసంహారక మందు పిచికారీ విధానాన్ని రైతులకు చూపిస్తున్న శాస్త్రవేత్తలు

**సేంద్రియ పద్ధతి పాటించాలి**

**ఎల్కతుర్తి:** పట్టు రైతులు మల్బరీ సాగులో సేంద్రియ పద్ధతి పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడి పొందవచ్చని జాయింట్ డైరెక్టర్ అనసూర్య అన్నారు. మండల కేంద్రం శివారులోని పట్టుపరిశ్రమ కార్యాలయంలో మంగళవారం పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ ఉమ్మడి జిల్లా పట్టు రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పట్టు పురుగులకు నాణ్యమైన ఆకు వేయాలని, గాలి వచ్చిపోయో విధంగా షెడ్డులో ఎగ్జిట్ ఫ్యాన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా ఇమ్యూనిటీ పవర్ కంట్రోల్ చేస్తుందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు షెడ్డు నిర్మాణంపై అందజేస్తున్న సబ్సిడీలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా హార్టీకల్చర్, సెరీకల్చర్ అధికారి వెంకటేశ్వర్‌రావు, సైంటీస్టులు వినోద్‌కుమార్, రాఘవేంద్ర, సెరీకల్చర్ మండల అధికారి సారంగపాణి, సంజీవరెడ్డి, ఏఎస్‌ఓలు రవీందర్, అరవింద్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జేడీ అనసూర్య

**మొక్కజొన్న పంట సందర్శన**

**మామునూరు:** ఖిలా వరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజన్నతో కలిసి కో ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న మంగళవారం దత్తత గ్రామాలైన తిమ్మాపూర్, అల్లీపూర్ గ్రామాల్లో మొక్కజొన్న పంటలను సందర్శించారు. ఈసందర్భంగా మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతిని గమనించారు. పురుగు నివారణకు ఎకరానికి 5 లింగాకర్షక బుట్టలు అమర్చుకుని రెక్కల పురుగుల ఉధృతి గమనిస్తూ ఉండాలని సూచించారు. పంట తొలిదశలో గుడ్ల సముదాయాన్ని నాశనం చేయాలని తెలిపారు. వేప నూనె 1,500 పీపీఎం 5 మిల్లీ లీటర్లు.. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని, పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎమమెక్టిన్ బాంజోయేట్ 0.4 మిల్లీ లీటర్లు, స్పినోటారమ్ 1 మిల్లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

## కుమారుడి కళ్లెదుటే తల్లి మృతి

- బైక్‌ను ఢీకొట్టిన ఆటో



యేసుమణి (ఫైల్)

**జఫర్‌గఢ్:** ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీ కొడడంతో తలకు బలమైన గాయాలతో కుమారుడి కళ్లెదుటే తల్లి మృతిచెందిన ఘటన జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రామ్‌చరణ్ తెలిపిన ప్రకారం.. మండల కేంద్రమైన జఫర్‌గఢ్ గ్రామ శివారు వడ్డెగూడెంకు చెందిన బండ్ల యేసుమణి (55) తన కుమారుడు ప్రవీణ్‌తో కలసి బైక్‌పై స్టేషన్‌ఘన్‌పూర్ బ్యాంక్‌కు బయల్దేరారు. గ్రామశివారు రైస్‌మిల్ సమీపాన వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి యేసుమణి ఎగిరి రోడ్డుపై పడడంతో తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రవీణ్‌కు స్వల్పంగా గాయపడ్డాడు. కళ్లెదుటే తల్లి మృతి చెందడంతో కుమారుడు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు స్థానికులను కలిచివేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ఆస్పత్రికి తరలించారు. కాగా, కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. మృతురాలికి భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు.

## డిగ్రీ కళాశాలలో చైన్ స్నాచింగ్

- లైబ్రరీ ఇన్‌చార్జ్‌పై దుండగుడి పిడిగుద్దులు
- రెండు తులాల చైన్ అపహరణ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉపేందర్



బైక్‌పై వెనక కూర్చుని వెళ్తున్న అనుమానితుడు

**జనగామ:** జనగామ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం చైన్‌స్నాచింగ్ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. భూక్యా ఉపేదర్ కళాశాలలో లైబ్రరీ ఇన్‌చార్జ్, రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధులకు హాజరైన ఆయన మొదటి అంతస్తులోని లైబ్రరీ చాంబర్‌కు వెళ్లాడు. రెండు రోజుల నుంచి గమనిస్తున్న యువకుడు.. ఉపేందర్ లైబ్రరీ తాళం తీస్తున్న క్రమంలో వెనక నుంచి వచ్చి పిడిగుద్దుల వర్షం కురిపించాడు. అప్పటికే స్వల్ప అనారోగ్యంతో బాధపడుతున్న ఉపేందర్, యువకుడి దాడితో గాయపడి అక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే ఆయన మెడలోని రెండు తులాల బంగారం గొలుసును లాక్కొని వెళ్లిపోతుండగా, ఇద్దరి మధ్య పెనుగులాట చోటుచేసుకుంది. విద్యార్థులు వెళ్లి చూసే సరికి ఉపేందర్ పడిపోయి కనిపించారు. విషయం తెలుసుకుని ఆయనను జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి, వైద్య పరీక్షలు చేయించారు. కళాశాలలో వందలాది మంది స్టాఫ్, సిబ్బంది, విద్యార్థులు ఉండగా, గుర్తు తెలియని వ్యక్తి రిజిస్టర్‌లో సంతకం చేసి లోనికి రావడం, ఉద్యోగి మెడలో గొలుసు అపహరించడంపై యాజమాన్యం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో పని చేయడం లేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కళాశాల ఎదుట ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా సదరు యువకుడు ద్విచక్రవాహనంపై వెనకాల బ్లాక్ కలర్ షర్ట్ వేసుకుని మరో వ్యక్తితో కలిసి వెళ్తున్నట్లు గుర్తించారు. యువకుడి ఆచూకీ తెలిపిన వారు జనగామ పోలీస్ స్టేషన్ సీఐ–87126 85202, ఎస్సై –8712685259 నంబర్లకు సమాచారం అందించాలని సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు.

## తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రత్యేక గుర్తింపు

- సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ

**పాలకుర్తి టౌన్ :** తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా నల్ల నర్సింహులు విగ్రహాన్ని మంగళవారం నారాయణ ఆవిష్కరించి, మాట్లాడారు. వచ్చే రెండేళ్లలో నల్ల నర్సింహులు శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. దేశంలో జమి లి ఎన్నికను వ్యతిరేకించేందుకు ఇండియా కూటమి తో కలిసి వామపక్ష పార్టీలు పని చేస్తాయని తెలిపారు. దేశంలో బీజేపీ ప్రభావం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ఎవరు పార్టీ మారినా రాజీనా మా చేసి వెళ్లాలన్నారు. మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ నల్ల నర్సింహులు, కొండా లక్ష్మ ణ్‌బాపూజీ విగ్రహల ఏర్పాటుకు కృషి చేస్తాన్నారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడు తూ.. నల్ల నర్సింహులు, నంద్యాల శ్రీనివాస్‌రెడ్డిలకు ఉరి శిక్ష వేసింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను నల్ల నర్సింహులు, పుచ్చలపల్లి సుందరయ్య లాంటి వారు రాశారని తెలిపారు. తెలంగాణసాయుధ పోరాట చరిత్ర కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఏం తెలుసునని ప్రశ్నించారు. కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా మాచర్ల సారయ్య వ్యవహరించగా.. నల్ల నర్సింహులు కూతురు అరుణ, మాజీ ఎమ్మెల్యేలు రాజారెడ్డి, వన్నాల శ్రీరాములు, నాయకులు జనార్దన్, రాజ్‌కుమార్, అబ్బాస్, రమేశ్, మంజల, సాంబయ్య, సుధాకర్, సుధాకర్, భార్గవ్, సుదర్శన్, కృపాకర్, పుల్లయ్య, ధనుంజయ్య పాల్గొన్నారు.



నర్సింహులు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణ, తదితరులు